

ప్రతి సాయంకాలం క్రమంతప్పకుండా సరిగ్గా నాలుగింటికి హౌరా స్టేషన్ దగ్గర ట్రామెక్కి, ధర్మతలా వీధిలో దిగి, పెరేడ్ గ్రౌండ్‌లోనుంచి తిన్నగా నడుచుకొంటూ పోయి, విక్టోరియా మెమోరియల్‌హాల్ ప్రాంగణంలో పచ్చటి పచ్చిక మీద,వేపచెట్టు క్రింద కూర్చుని ఆవిడకోసం ఎదురుచూసే ఆ తెలుగు యువకుణ్ణి, కలకత్తా నగరంలో ఎవరూ గుర్తించినట్టు కనబడదు! వాళ్ళంతా తనను అలా గుర్తించాలని అతను కోరుకోనూ లేదు కూడా! తనకు నా అన్నవాళ్ళెవరూ ఈ ప్రపంచంలో ఇహ ఉండబోరని ఆనాటిరాత్రి రాజమండ్రిలో జనతా ఎక్స్‌ప్రెస్ ఎక్కి కలకత్తా వచ్చేస్తున్న క్షణంలోనే అనుకున్నాడు. అను కుంటూ అప్రయత్నంగా బావురుమన్నాడు. ఆ తెలుగు పట్టణం, ఆ ఆంధ్రదేశం వెనక్కి ఎక్కడికో పోతున్నపుడు అతను పడ్డబాధ ఇంతా అంతా కాదు.

కాని ఉత్కళదాటి వంగదేశంలో ప్రవేశించి పవిత్ర గంగాజలాన్ని చూసినపుడు తనఒంటరి తనానికీ, అసహాయతకూ భయపడ్డా, తన నిక్కడ ఓదార్చేదిక్కూ మొక్కూ లేదని గుర్తించి పరిందుకుపోగాడు.

ఆనాటి సాయంకాలం ఆరింటివరకూ అతను ఏచోటా ఆగలేదు; ఎవరినీ గుర్తించ లేదు. ఒకసారి ట్రాంక్రిందా, మరోసారి బస్సుక్రిందా పడబోయాడు. అలానడి జీవితాన్ని చాలించుకోవాలనే ఉద్దేశ్యమే ఉన్నట్టయితే తనిక్కడికి వచ్చే చావవసరంలేదు.

అయితే ఇంతదూరం తనెందుకొచ్చినట్టు?

ఈ ప్రశ్నతో అతను స్తబ్ధుడై కొయ్య బారిపోయాడు.

ఆక్షణంలోనే అతను ఈలోకంలో పడ్డాడు. కళ్ళు బాగా విప్పిచూసేసరికి ఎదురుగా కేరింతలుకొడుతూ ఆడుకుంటున్న కుర్రాళ్ళు అతని కళ్ళనుంచి నీళ్ళు కార్పించారు. ఎంతసేపో వాళ్ళను చూస్తూ, ఆలోచిస్తూ నిలబడిపో యాడు. చీకటి పడుతున్నపుడు పిల్లలంతా ఇష్టంలేకపోయినా తల్లుల పిలుపులు విని తిరిగి వెళ్ళిపోతున్నారు.

అతనికి ఆ ప్రదేశంలోనే ఆరాత్రంతా ఉండిపోవాలనిపించింది. ప్రపంచంలో అన్నిటినీ పరిత్యజించి బికారిలా పరారై పోయినతనకు మమత మీదా, బ్రతుకుమీదా మక్కువ కలగడం ఆశ్చర్యమే మరి!....కాని ఆ మర్నాటినుంచి అతను ఆ ప్రదేశంలోనే ఘోషాల్‌బాబుగారి మేడ మీద రెండోఅంతస్థులో చిన్నగదిని అద్దెకు తీసుకొని నివసించ మొదలుపెట్టాడు.

ఆ మొదటి నాలుగైదు రోజులూ,అతను బలవంతంగా ఆనందాన్ని నిరుపుతెచ్చుకున్నాడు. కాని అతనికది చిక్కలేదు! భయపడ్డాడు; బాధపడ్డాడు; తిరిగి తనకు బ్రతుకుమీద విరక్తికలిగి ఇక్కడినుంచి మరోచోటుకు మజిలీవేయాలేమోనని భీతి చెందాడు...సరిగా ఇదే సమయంలో ఆవిడను చూడడం తటస్థ పడింది.

ప్రొద్దుట సాయంకాలం ఆమె ఎదురింట్లో క్రింది అరుగుమీద కూచునేది. పిల్లల్ని తన చుట్టూ కూచోబెట్టుకుని ఆడించేది! అరుదుగా నవ్వేది. ఆ నవ్వినప్పుడైనా తలెత్తి ఎదురింట్లో రెండో అంతస్తులో కిటికీదగ్గర కూచున్న తనను చూస్తుందేమోనని ఆశించేవాడు. ఆశ నిరాశ అయేది. అతనికి కోపం వచ్చేది; అభిమానం తిరగబడేది; పౌరుషం పుట్టుకొచ్చేది. 'ఆడది! తన పాతి వ్రత్యాన్ని ఋజువుచేసుకునేందుకు తాపత్రయ పడుతుంది'— అనుకునేవాడు. లోలోపల ఆ 'పవిత్ర' మనస్సు మరోలా స్పందిస్తూ ఉండచ్చు. కాకపోతే ఆ క్రీగంటి చూపు లెందుకు? అనుకునేవాడు. 'హుఁ! ఆడజాతి!' అని కసురుకునేవాడు.

కాని రోజురోజుకూ అతనికి ఆరాటం ఎక్కువవజొచ్చింది. ఆవిడ నిర్లక్ష్యం, మౌనం, తిరస్కారదృక్కులు అతనిలో ఉత్సాహాన్ని, అన్వేషణనూ, అభిమానాన్నీ రెచ్చగొట్టాయి. ఎలాగైనా ఆవిడతో మాటలు కలుపుకొని, స్నేహాన్ని సంపాదించి, సర్వస్త్రీజాతి ఇంతే అని ఋజువుచేయాలన్న మొండి పట్టుదల హెచ్చయింది.

ఆమెను చూసి దగ్గాడు; తుమ్మాడు; ఇకిలించాడు. ఆమె తలపైకెత్తినపుడు చేతొత్తి పిలవబోయి తగ్గాడు. రోజులు గడిచేకొద్దీ ఆమెలో వస్తున్న మార్పులకు అతను చాలా సంతోషించబోయాడు. తన ఊహలకూ, భావనలకూ సాక్ష్యంగా, ఆమె ప్రతిసాయంకాలం క్రమంతప్పకుండా వీధిలో హాజరుకావడమే— అని నిర్ణయించుకున్నాడు.

అయితే, ఈ వ్యవహారం ఇలా ముగియకుండా ఒకనాడు ఇదే విక్టోరియా మెమోరియల్‌హాల్ ఆవరణలో ఆ వేపచెట్టు క్రింద, పచ్చటి మైదానం మీద దైవికంగా ఆమెను కలుసుకున్నాడు.

దూరంగా ఉండి ఆడవారి క్రీగంటి చూపులకూ, చిరునవ్వులకూ చేష్టలకూ రక రకాల అర్థాలూ, భాష్యాలూ చెప్పుకున్న అతను— ఆమె దగ్గరగా ఎదురుగా సాక్షాత్కరించేసరికి మామూలు మానవుడిలా కంపించి పోయాడు. ఆడదాని స్వభావాన్ని అతి తేలిగ్గా విమర్శించే ఆ మగమహారాజు, ఒంటరిగా ఉన్న ఆ స్త్రీని చూసి, అలా నిశ్చేష్టుడై కంపించిపోతూ ఉంటే —ఆమె నిజంగా మనస్సులో నవ్వుకునే ఉండాలి మరి! తను స్కూలు నుంచి గొడుగూ, పుస్తకాలూ చేతబట్టుకొని వస్తూ ఉంటే, తన ప్రతి అవయవం మీద విమర్శలు చేసే పురుషపుంగవుల జాబితాలోనే అతన్నీ ఆవిడ చేర్చి ఉండవచ్చునని, ఆక్షణంలో ఆమె ముఖంలో కలిగిన మార్పును చూసినా, వైఖరిని చూసినా తెలుస్తుంది. కాని, అతను ఆవిడను పలక రించాలనుకొని పలకరించలేక నోరుతెరిచి, దృష్టి నిలిపి కొయ్యబారిపోవడంతో, ఆవిడ ఎడం చెయ్యిపట్టుకొని నిలబడి ఉన్న ఏనిమి దేళ్ల కొడుకు, అతన్ని ఎగాదిగా చూసి, ఒక చిన్న చిరునవ్వు పారేశాడు. అలా పారేసిన నవ్వును అతను అతి భద్రంగా పట్టుకొని సమాధానమిచ్చాడు—చిరునవ్వుతోనే!

పసడు తల్లివేపు తలెత్తి చూశాడు.

తల్లి కొడుకువేపు చూసి, తలతిప్పి అతని వేపు చూసింది—పొట్టబడే బుగ్గలతో. అతని ఒళ్ళంతా ఝల్లుమని, రక్తం తప్పున పాదాల్లోకి పరుగులు తీయడంతో, అతను పాతాళంలోకి దిగిపోతున్నట్టు ఫీలయి, నిగ్రహించుకొని, ఎండిపోయిన గొంతుకకూ, పెదవులకూ తడి తగిలించి నత్తిగా ఏదో అన్నాడు. ఆవిడా సమాధానమిచ్చింది. అదిగో — ఆరోజు మొదలు, వాళ్ళిద్దరూ ఆపచ్చికలో, ఆచెట్టు

*మనసు ఈయలేని మగువతో మమత త్రెంచుకొన్నా మమతానుబంధం తెగదు మానవునికి. చేసినది తప్పో ఒప్పో తెలియదు. అర్థం చేసుకునే వారు ఉండరు. శిక్ష అనుభవించక తప్పదు. ఇక బ్రతకడం ఎందుకు? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేవారు ఎవరు? ఎప్పటికి అయినా కనుపిస్తారా?*





ముగ్ధ ఫోటో—ప్రభాకర్ మహాధిక్ (బొంబాయి-28)

క్రింద కలుసుకో మొదలు పెట్టారు.

మొదట్లో ఆవిడ అతని గురించి ఏమీ అడగలేదు. అతనూ ఆవిడ గురించి ఏమీ అడగలేదు. స్నేహంగా ఉందామన్న బాధా, వ్యధ తప్ప మరో ఆత్రుత కనిపించలేదు వాళ్ళిద్దర్లో. కాని రానురాను ఆదివారాలు బొటానికల్ గార్డెన్స్, జూవలాజికల్ గార్డెన్స్‌కూ, పిక్నిక్ ట్రిప్పులకూ, లైట్‌హౌసుకు సినిమా థియేటర్లకు ప్రోగ్రాములూ, ఆపేపచెట్టు క్రింద సర్వకళలకూ సంబంధించిన చర్చలూ వాద ప్రతివాదాలూ, తమతమ సంస్కృతుల్లో గల విభిన్నత్వాల్లో ఏకత్వానికిగల ప్రాముఖ్యానికి వాళ్ళిచ్చిన గౌరవమూ, ఆసక్తి—వాళ్ళ నిద్దర్నీ మరింత సన్నిహితం చేసి, ఒకవాడు అతనే— ప్రపంచాన్నీ గతజీవితాన్నీ పరిత్యజించి పరివ్రాజక జీవనం గడుపుదామనుకున్న శేఖరమే—ఆమెను అసాధ్యమైన కోరిక కోరాడు.

ఆమె సమాధానం చెప్పలేదు మొదట్లో. తర్వాత కొడుకువేపు చూసుకొంది. తర్వాత

# తప్పు

ఏడ్చుకుంది. అతను కీ.దార్చబోయాడు — భర్త జ్ఞాపకానికివచ్చి ఏడుస్తూందని. కాని అప్పటికే అతను, ఆమె గురించి అడగదలచుకోలేదు. ఒకగంట వాళ్ళట్లా నిశ్శబ్దంగా కూచున్నారు. ఇంత ఘోర నిశ్శబ్దాన్ని రబీన్ సహించలేక తల్లివేపు, శేఖరంవేపూ తేరిపార చూడ మొదలుపెట్టాడు.

అంతలో ఆవిడే మెల్లగా, ఆంగ్లంలో అంది— తనకు పెళ్ళంటే ఏవిటో అర్థం కావటం లేదని.

అతను గబ్బున సమాధాన మిచ్చాడు.— 'అలా అర్థం కాకపోవడమే మంచిది' అని. "ఏనాడు మనకు ఈ నిఘంటువుల్లోని మాటలన్నిటికీ నిజమైన అర్థాలు తెలిసిపోతవో ఆనాడు మానవ అస్తిత్వానికి విలువే ఉండదేమో! మన బ్రతుకుల్లో కొంత తికమక, అలజడి లేకపోవడంతో జీవితం కృత్రిమం కావ"న్న సుభాషితాన్ని ఆమె వేపు విసిరాడు.

ఆమె వాటిని అర్థం చేసుకునేందుకు ఆరాత్రంతా పరుపుమీద పడుకొని తెగ ఆలోచించింది. క్షణక్షణం తలెత్తి ఎదురింటి రెండో అంతస్థు కిటికీవేపు చూసి ఆ గదిలో నుంచి పడుతున్న చీకటి కిరణాలను చూసి నిట్టూర్పువిడిచి తిరిగి పరుపుమీదకే వాలి పోయేది.....

ప్రత్యూషను సూచించే పక్షుల కిలకిలా రావంతోబాటు ఆవిడ హృదయమూ ఒక నిశ్చితాభిప్రాయంతో పరవళ్ళు త్రొక్కింది.

కాని వెంటనే ప్రక్కనున్న కొడుకును చూసుకొని దిగజారిపోయింది.

"శేఖర్‌బాబు! రబీన్‌ను ప్రేమించగలడా?"— ఈ ఒక్క ప్రశ్న ఆమె నిశ్చయాన్నీ సంకల్పాన్నీ తునాతునకలు చేసిపారేసింది. కళ్ళు మూసుకొని ముఖం కప్పుకొని ఏడ్చుకుంది—'ఠాకూర్! నా బ్రతుకేం కావాలి' అని.

ఆ రాత్రంతా శేఖర్‌కు కూడా నిద్ర పట్టలేదు. తనేం చెయ్యబోతున్నాడు? తను అనాలోచితంగా, ముందు చూపులేకుండా గాలి మేడలు కడుతున్నాడా?

తను బ్రహ్మచారి కాదు. తన భార్య ఇంకా బ్రతికే ఉంది. తన కొడుక్కు అక్షరాభ్యాసం చేసే వయస్సొచ్చింది. తన పిలోకంలో వదిలిన తల్లి జీవించే ఉంది. తన స్వగృహమూ ఉంది. వాళ్ళందరినీ విడిచి తన కీలోకంలో ఇహ 'నా' అన్నవాళ్లెవరూ ఉండబోరని విరక్తిచెంది పరార్పైపోయిన తను— మళ్ళా, కొందరు 'నా' అన్నవాళ్ళను కూడదీసుకోవడం అర్థమేమిటి? ఏ సమాజం, ఏ మానవజాతి, ఏ ప్రాణికోటి ఈ సంఘీభావ హృదయాన్ని తనలో సృష్టించింది? ఏ చోటును విడిచి ఎక్కడికి తన ప్రయాణం? ఏది అరణ్యం? ఏది ఒంటరితనం? ఎక్కడఉందీ చైతన్యం? ఒక మనిషికీ మరో మనిషికీ ఎందుకీ సాన్నిహిత్యం? స్నేహం? సంసారం? వీటిని విచ్ఛేదం చేసుకుపోతే, వ్యక్తికి లక్ష్యం, గమనం ఎటు? ఎందుకు? ఎలా? అంతా అయోమయం. ఎటు చూస్తే అటు చీకటి.

తను అగ్నిసాక్షిగా జయను పెళ్ళి చేసుకున్నాడు. ఈ బెంగాలి మనిషి తనలాంటి పురుషుడే, తన లాగే అగ్నిసాక్షిగా వివాహం చేసుకొని ఉంటాడు.

తను రాజమండ్రిని వదిలాడు.

అతనీ ప్రపంచాన్నే వదిలాడు.

జయ, సుచిత్ర కూడా 'విధవ'లే!

సుచిత్ర వివాహానికి రబీన్ సాక్ష్యం.

జయ మాంగల్యానికి బాబు ఋజావు.

ఇప్పుడు సుచిత్ర పెళ్లి చేసుకోబోతూంది తనను!

జయకూడా మరొకర్ని పెళ్ళి చేసుకుంటుందా?

అసంభవం!

తనింకా బ్రతికే ఉన్నాడు. జయ మళ్ళీ పెళ్ళి చేసుకోవడం తను సహించలేదు. జయ పునర్వివాహం చేసుకోకూడదు! చేసుకోకూడదు! చేసుకోకూడదు!

ఎప్పుడో, ఒకానొక సమయాన ఒక పరాయి స్త్రీతో తనకు జరిగిన పవిత్రకాండలో పడిన మూడు ముళ్ళనూ త్రెంచేసి ఇలా వచ్చేసిన తను, జయను ఇంకా తన ప్రాణానికి ప్రాణమని ఎందుకనుకోవడం?

అసలు తను జయను విడిచిపెట్టింది ఎందుకు?

జయ నైతిక ప్రవర్తనమీద తనకు అనుమానం కలిగింది. ఆరోజువరకూ స్వర్గసీమను చిత్రించుకొంటూ ఉన్న తను—జయా, జయబావ వాసూ ఏకాంతంగా కూచునితిరిగి పోయిన స్మృతి పుటల్ని త్రిప్పుకోటం కళ్ళారా చూశాడు. జయ అంతవరకు తనను వంచిస్తూ కపటనాటకం ఎందుకాడవలసి వచ్చింది?

ఆడదానికి భర్త అనేవాడొక రక్షరేకా? తన చాటున, తన పూర్వచరిత్రనంతనూ దాచుకొని బ్రతికవలసినంత ఆత్మవంచన జయ కెందుకు కలిగింది? ధైర్యంగా శోభనంనాడే 'నేనూ మా బావ ప్రేమించుకున్నాం; కాని అది వాళ్ళకు ఇష్టంలేక, ఈ వివాహం మీతో జరిగింది. మీకు హృదయమనేది ఏకోశాన ఉన్నా నన్ను మా బావకే అర్పించండి' అని మనస్సు విప్పుకున్నట్టయితే తనే స్వయంగా వాళ్ళిద్దర్నీ కలిపేసి ఉండేవాడు.

అతని అంతరాత్మ ఫక్కున నవ్వింది.


'నువ్వలా చేయగలవా?' అని సవాలు చేసింది.

అతను ఓటమిని ఒప్పుకోలేక, విధాన్ని భరించలేక కృంగిపోయాడు. నాలుగేళ్ళ కొడుకును చూసి అసహ్యించుకున్నాడు.

తల్లి చేసిన పాపానికి వాడెందుకు నిందితుడు కావాలి? వాడి ముఖంలోకి లోతుగా చూశాడు—వాను పోలికలు కనిపిస్తేనేమోనని! కనిపించినట్టు ఫీలయాడు. కోపంతో, కసితో కంపించిపోయాడు. ఆపాపిష్ఠి స్త్రీని కంఠం పిసికి చంపెయ్యాలనుకున్నాడు. బ్రతుకు మీద విరక్తి కలిగింది. విషం తిని తనను తాను అంతం చేసుకోవాలనుకున్నాడు. అప్రయత్నంగా వేదాంతం మాటాడుకొని పిచ్చిగా నవ్వుకున్నాడు.

'ఈ విశాల విశ్వంలో నాకూ, నీకూ, వాడికీ సంబంధ మేమిటోయ్? అందరం నాటకంలో పాత్రలలాగున కాసేపు ఆడుకొని పోతాం—అంతే మనిషి జీవితం కూడా!' అని వేదాంతిలా మాటాడుకొని—అంతా మాటాడుకొని, పెట్టెలోనుంచి చేతికొచ్చినంత డబ్బు తీసుకొని పరారైపోయాడు.

తను మాయంకావడంతో, జయ తన తప్పును తాను తెలుసుకొని పశ్చాత్తాపంతో పవిత్రమైపోతుందని అనుకొని మరీ బండెక్కాడు,



'బోసి నోర్విప్పితే'

ఫోటో—కె. ఎస్. వి. ప్రసాద్ (ముమ్మిడివరం)

అంతఃసంఘర్షణతో మనిషి పూర్తిగా నీరసించి పరుపుమీద వాలిపోయాడు. అప్పుడే రబీన్ పరుగెత్తుకుంటూ వచ్చి పడుకున్న వాణ్ణి లేపి "నాకు తెలుగు అక్షరాలు నేర్పుతామన్నారుగా?' అన్నాడు.

శేఖర్ లేచి రబీన్ను ఎందుకో చప్పున గుండెలకు హత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు. అలా చేసినందుకు వెంటనే సిగ్గుపడి క్షమాపణ చెప్పుకోబోయాడు. కాని ఆ పసివాడికి అంత భాష అర్థమవుతుందా?

'నేర్పుతారా?' అని రెట్టించాడు రబీన్-ముద్దుపెట్టుకున్న బుగ్గను ఎడంచేత్తో తుడుచుకుంటూ

'నేర్పుతా. పుస్తకమేదన్నా తెచ్చుకో' మని రబీన్ బయటకు పంపించేసి శేఖరం తలను పట్టుకొని మంచం మీద కూలబడిపోయాడు.

వితంతువులను వివాహం చేసుకున్న వాళ్ళందరూ తనలాంటి భావాలకు లోనైన వాళ్ళేనా? వివాహం చేసుకొనే ముందూ, తర్వాతా వాళ్ళ కేలాంటి ఆలోచనలు కలిగి ఉంటాయి? స్త్రీ పురుష సంబంధాలను సాంఘిక నియమాల మధ్యా, నైతిక సూత్రాల తోనూ బంధించే ఉద్దేశ్యంతో శాసించిన ఈ వివాహకాండ హిందువుల్లో ఇంత పవిత్రంగా విరుద్ధంగా ఎందుకు ఉంటుంది? మిగతా ప్రపంచ ప్రజల మనస్తత్వానికీ హిందువుల ప్రవృత్తి వక్ర మనస్తత్వానికీ కారణం తనలాంటివారేనా?

అతను సమాధానం చెప్పుకునే లోపునే



# తప్పు

రబీన్ తలుపుతోసుకుంటూ వచ్చి, పుస్తకాన్ని శేఖరానికి అందిస్తూ 'త్వరగా రాయండి' అన్నాడు.

వాడి ఉత్సాహానికీ, ఉల్లాసానికీ శేఖరం ముచ్చటపడి పక్కకు చేర్చుకుంటూ పుస్తకం వేపు చూశాడు. చిన్న నోట్ పుస్తకంలా ఉంది. తెరిచి చూశాడు. డైరీ! 1946 వ సంవత్సరం—మొదటి పేజీలో తాటికాయ లంతేసి అక్షరాలతో ముద్రించబడి ఉంది. పేజీలు తిప్పుతూ ఉంటే అతని చేతులు వణికాయి. కాగితాలు బాగా వలిగిపోయి ఉన్నాయి. ప్రతి పుటలోనూ సిరా మరకలు, మసి ముద్రలు! అక్కడక్కడా కొన్ని కాగితాలే లేవు. డైరీ అంతా ఇంగ్లీషులోనే వ్రాసిఉంది.

ఏప్రిల్ మూడవతేదీ పేజీలో మరొకరి దస్తూరీతో 'మిస్ సుచిత్రా ముఖర్జీ—డాటరాఫ్ అక్షయకుమార్ ముఖర్జీ, లాండ్‌లార్డ్, విలేజ్ దుర్గాపూర్, నవకాళీ జిల్లా' అని ఉంది. ఇది సుచిత్ర చిరునామా అయిఉండవచ్చు. అక్షయబాబు సుచిత్ర తండ్రిగారనీ, ఆయన దుర్గాపూర్‌లో జమీందారనీ శేఖరం గుర్తించాడు. అందువల్ల సుచిత్ర జన్మస్థలం తూర్పు బెంగాల్ అయిఉండచ్చు.

శేఖరం మిగతా పేజీలు ఆతృతగా తిప్పి చదివాడు.

జనవరినుంచి అక్టోబర్‌వరకూ ఉన్న డైరీ ఒకలాగున ఉంది. తర్వాత మరోకలాగున ఉంది. అక్టోబర్‌వరకూ ఉన్నదానిని బట్టి—

సుచిత్ర ఢాకా యూనివర్సిటీలో బి. ఏ. ఆనర్స్ చదువుతూ ఉండేదనీ, యూనివర్సిటీలో విద్యార్థినుల సంఘానికి కార్యదర్శినిగా ఉంటూ చాలా కలుపుగోలుగా ఉండేదనీ, రవీంద్ర సంగీత్ అన్నా, బెంగాలీ సాహిత్యంలో మైకేల్ మధుసూధన్ దత్తు యొక్క మైకేల్ ఛందస్సన్నా చెవికోసుకొనేదనీ, ప్రస్తుత వాతావరణంలో కొద్దికొద్దిగా జరుగుతున్న హిందూముస్లిమ్‌ల కొట్లాటలను ఆపడానికీ, దేశవిభజనకు వ్యతిరేక ప్రచారాన్ని చేసేందుకూ ఢాకాలో చాలా చోట్ల ప్రదర్శనలు జరిపిందనీ, యూనివర్సిటీకి దుర్గాపూజా సెలవులు ఇచ్చినపుడు స్వగ్రామానికి వచ్చిందనీ శేఖరం తెలుసుకున్నాడు.

అక్టోబర్ దుర్గాపూజ దగ్గరనుంచి వ్రాసిన పేజీల్లోని వ్రాతల్ని చదివి శేఖరం నిజంగా ఏడ్చేశాడు! అతని ఆతృత హెచ్చు కావడంతో డైరీ కాగితాలు గబగబా త్రిప్పాడు. ఈ కాగితాల్లో తారీకులూ, వారాలూ, దినాలూ లేవు. కొంత సిరాతో, కొంత పెన్సిల్‌తో వ్రాసి ఉంది.


1946 అక్టోబర్:

మా భవనానికి ఎదురుగా ఉన్న విశాలమైన మైదానంలో పెద్ద పందిరివేశారు. ఆ ఏడాది ఎప్పుడూలేనంత వైభవంగా దుర్గాపూజ చెయ్యాలని అన్నయ్య పట్టుదల. నాన్నగారు 'అధ్యక్షపదవి' నుంచి ఎప్పుడో తప్పుకున్నారు. కాబట్టి అన్నయ్యదే ఇష్టారాజ్యం. రెండు దినాలూ ఉత్సవం బాగా జరిగింది. మూడోనాటి రాత్రి దుర్గామాయికి నైవేద్యం జరుగుతున్న సమయంలో బయట పెద్దపెద్ద కేకలు వినిపించాయి.

అన్నయ్య దుర్గవిగ్రహం దగ్గర ఉన్నాడు. నాన్నగారు బయట ఎవరితోనో మాటాడుతున్నారు. అమ్మ వచ్చేపోయే స్త్రీల నాహ్వానిస్తోంది. నేను ఇంట్లోకి ఏదోపనిమీద వెళ్ళి తిరిగి వస్తున్నపుడు ఎదురుగా ఇరవైముప్పైమంది ముస్లిమ్ గూండాలు గేటులోనుంచి చొరబడి మొట్టమొదట నాన్నగారిని క్రింద పడేసి బల్లెంతో ఒకపోటు పొడిచారు. దీపాలకాంతిలో నాకు బాగా కనిపించింది. నాన్నగారు నేలమీదుపడి కాళ్ళూచేతులూ కొట్టుకొంటూ ప్రాణం విడిచారు. అన్నయ్య నా దగ్గరకు చప్పున పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను ఇంట్లోకి బరబరా ఈడ్చుకొనిపోయాడు. వాడింకా ద్వారం దాటనేలేదు. ఒకపెద్ద మెరుపు మెరవడం, రక్తంలో అన్నయ్య మొండెం నుంచి శిరస్సువేరై బంతిలా గదిలోకి తూలిపోవడం జరిగాయి. నేను వెనక్కు చూసేసరికి నలుగురు రాక్షసులు హాహాకారాలు చేసుకుంటూ, నన్ను లోపలికి ఈడ్చుకొనిపోయి... కసాయి వాళ్ళకయినా జాలి ఉంటుందేమో... క్రూరాతిక్రూర మృగాలకైనా ఏదో ఓ మూల అంతరాత్మలాంటిది ఉంటుందేమో.. కాని మృగాలకు మాత్రం... నన్ను వివస్త్రను చేసి...

తెల్లవారేసరికి దుర్గాపూర్ నిర్మానుష్యమైపోయింది. ఈ పాపాలనూ హింసా కాండనూ దుర్గామాయి అలా చూస్తూనే ఉంది. నేను లేవబోయాను.. కాళ్ళలో శక్తిలేదు... నా శరీరమంతా తిరుగుతున్నట్టనిపించింది. ఒంట్లో శూలాలు గుచ్చినట్లు బాధ! కళ్ళు విప్పి చూశాను. నామీద కొన్ని విరిగిన సామాన్లు పడి ఉన్నాయి. విడవకుండా ఒక ఆర్తనాదం దూరంనించి వినిపిస్తోంది. శక్తి నంతనూ కూడబెట్టుకొని లేచి నిలబడ్డాను.

నాఒంటిమీద బట్టలేదు. సిగ్గు అనేదానికి నాకాక్షణంలో అర్థం తెలీలేదు. మెల్లగావెళ్ళి



కన్యాకుమారిలోని గాంధి మండపం ఫోటో—వి. కస్తూరి (కోయంబత్తూరు–1)

వా బీరువా తెరిచాను. ఒక్క వస్త్రమూలేదు దాంట్లో. విరిగిపోయిన అద్దంలో నా ముఖం దెయ్యంలా అగుపించింది. ముఖమంతా కరుడుగట్టిన నెత్తురు. చెక్కిళ్లూ ముక్కూ వాచిపోయాయి. కుడిరొమ్ములో ఎడతెగనిపోటు. క్రూరాతిక్రూరమైన మృగంకూడా అంత కసిగా పళ్ళతో కరవదు... అంత బాధలోనూ నాకు నవ్వొచ్చింది. విరిగిపడున్న కుర్చీకాలు ఊత చేసుకొని మెల్లగా బయటకొచ్చాను. అన్నయ్య శిరస్సూ, మొండెమూ ఇంకాఅలానేఉన్నాయి. నాకు కళ్ళు తిరిగాయి. డోకొచ్చినట్టయింది. గుండె బండచేసుకొని దుర్గామాయి పందిట్లోకి వెళ్ళాను.

అక్కడ ఇద్దరు మగాళ్ళశవాలు, ముగ్గురు ఆడవాళ్ళ శవాలు ఉన్నాయి. ఆడవాళ్ళ కళేబరాలన్నీ దాదాపు వివస్త్రలుగానే ఉన్నై. అమ్మ శరీరం కోసం వెదికాను. చివరికి, ప్రాంగణంలో జామిచెట్టువెనకాల శవం కనిపించింది.

నాకు ఏడుపు రాలేదు. ఏడ్చేశక్తి పోయింది... అంతవరకూ నాఒంటిమీద అసలు బట్టే లేదన్నస్పృహలేదు. మెల్లగా దుర్గమూర్తి దగ్గరకు వచ్చేసరికి, ఆ విగ్రహానికి కట్టిఉన్న చీర నా నాగరకతను జ్ఞప్తికి తెచ్చింది.

దుర్గకాళ్లమీద్దపడి భోరున ఏడ్చాను. ఎవరికి వినిపిస్తుంది? ఏవిటీ అమానుషత్వం? వీళ్ళకు ఈ అమాయకుల మీదింత కోపెందుకు? రాజకీయాల్లో రక్తపాతం ఉంటుందా?..... దుర్గ విగ్రహం ఏమని సమాధానం చెబుతుంది? చప్పునలేచి ఆమట్టి బొమ్మకు కట్టిఉన్న చీరనుతీసి నాశీలాన్ని దాచుకున్నాను. నాశరీరం అచ్ఛాదన వెనక్కు వెళ్లగానే నాకు ఒక్కసారిగా ఆవేదన, ఆవేశం ముంచుకొచ్చాయి.. ఈజాతిని సర్వనాశనం చేయాలన్న పౌరుషం ముంచుకొచ్చింది. ఒక్కొక్క రాక్షసుణ్ణే చిత్రవధచేసి ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాను...

కాని తర్వాత పుటలోని రాతల్ని చూసి, సుచిత్ర అంతరాక్షసానికి తలపడలేదని శేఖరం గ్రహించాడు.

మిగతా పుటల్లో, తను దుర్గాపూర్‌నుంచి చివరి కెలా కలకత్తా చేరుకున్నదీ వ్రాసింది.

దుర్గాపూర్‌నుంచి మరికొంతమంది అభాగ్యులతోబాటు చౌమాపీ మీదుగా కాలి నడకను అఖాపూర్ చేరుకుంది. అక్కడ మరికొందరు కాందిశీకులు కలిశారు. వీళ్ళంతా త్రిపురా జిల్లాలోని అగ్రతలా చేరుకునేసరికి శవాల్లా తయారయ్యారు. దారిలో కొందరు ఆకలికీ, ఆశక్తతవల్లా ప్రాణాలు విడిచారు. చావగా మిగిలిన వాళ్ళను కాంగ్రెసు వలంటీర్లు అగ్రతలా కాంపుకు పంపించారు. అక్కణ్ణుంచి ఖాన్‌పూర్, ఖాన్‌పూర్‌నుంచి గొలందో పద్మానది మీదుగా చేరుకుని, తిన్నగా రైల్లో సియాల్దా చేరుకున్నారు.

కలకత్తాలో సుచిత్రకు తెలిసిన వాళ్లెవరూ లేరు!

వంశమంతా నాశనంకాగా, శ్రీమంతుల భోగభాగ్యాలు సమూలంగా నాశనంకాగా, వేల కొద్దీ కాందిశీకులు పేవ్‌మెంట్లమీదా, చెట్లకిందా కాపరాలు పెట్టుకోవడం చూసి సుచిత్ర దుఃఖంతో ఏడ్చుకునేది.

సుచిత్రను కాంప్‌లో వేశారు. తల మీది గాయాలూ, రొమ్ములమీది కాట్లూ పూర్తిగా మాని సంపూర్ణారోగ్యం చేకూరేసరికి సరిగా మూడు నెలలు పట్టింది. కాని డాక్టర్లు ఓవింతవార్తను ఆమె చెవిలో వేసేసరికి ఆమె వెంటనే మూర్ఛపోయింది.

తర్వాత ఆ గర్భాన్ని విచ్ఛేదం చేసుకోవడానికీ,



**ఆధిక్యం ఎవరిది?** ఫోటో—గంటా శ్రీరామమూర్తి (భీమవరం)

ఆత్మహత్యచేసుకోడానికి చాలా ప్రయత్నాలు చేసి క్యాంప్ అధికారుల ఆగ్రహానికి గురయింది. అయితే 'రబీన్' కేర్‌మంటూ భూమ్మీద పడేసరికి, ఆ పసిగుడ్డును ఎందుకు చప్పున ఎత్తుకొని హృదయానికి హత్తుకుందో అర్థం కాలేదట! తర్వాత క్యాంప్‌లోని ఒక డాక్టర్ సహాయంతో విద్యాసాగర్ కాలేజీలో ఉద్యోగాన్ని సంపాదించుకొని, హౌరాలో అభిమానంతో [illegible] మొదలుపెట్టిన దగ్గరనుంచీ తను పునర్జన్మ ఎత్తినట్టు భావిస్తోందట.

ఇదంతా చదివి శేఖరం ఎంతైనా ఆశ్చర్యపోయాడు. పక్కన కూచుని ఉన్న 'రబీన్'ను పరీక్షగా చూసుకొని ఒక్కసారిగా ముద్దుల వర్షం కురిపించాడు. వాడికిదంతా అర్థంగాక తేరిపారచూస్తూ ఉంటే శేఖరం చప్పునలేచి ఎదురింటికి పరుగెత్తాడు.

బయట గదిలో సుచిత్రలేదు. లోపలికి వెళ్ళాడు. అక్కడా అగుపించలేదు. పిలిచాడు. సమాధానంలేదు. పెద్దగా కేకవేశాడు. మెల్లగా వంటింట్లోనుంచి ఓ శోకమూర్తి కళ్ళు ఒత్తుకుంటూ వచ్చి అతని కెదురుగా నిలిచింది.

శేఖరం ఆనందాతిశయంతో ఆమె దగ్గరగా వెళ్ళి గాఢంగా ఆమెను కావలించుకున్నాడు—'మన్నిక ఎవరూ వేరు చెయ్యలేరు సుచిత్రా...' అంటూ.

అందుకు సుచిత్ర చాలా సౌమ్యంగా, శాంతంగా సమాధాన మిచ్చింది—'ఒక్క మీ అర్ధాంగీ, ఔరసుడూ తప్ప—'

శేఖరం గతుక్కుమన్నాడు.

'మిమ్మల్ని నేను ఏనాడూ తప్పుగా భావించలేదు శేఖర్‌బాబూ!...కాని పత్రికలో మీరు, మీభార్య, మీ కుమారుడు తీయించుకున్న ఫోటో అచ్చయి వాటి క్రింద ప్రకటనను చూసేసరికి, మీ శిలాహృదయానికి నాకు భయం వేసింది....'

# తప్పు

శేఖరం దిగ్భ్రమతో మ్రాన్పైపోయాడు.

'మా ఫోటో పేపర్లలో పడిందా? ఏమని ప్రకటించారు?— పత్రికేది?—' అంటూ కంగారు పడుతూ ఉంటే సుచిత్ర నిలవంగా అంది.

'మీరా పత్రిక చూడకండి శేఖర్‌బాబు.... కాని మీరు ఇంటినుంచి ఎందుకు పరారై వచ్చిఉంటారో నేను చాలా వరకు ఊహించాను. నా ఊహ తప్పుకాదనే అనుకుంటా. ఏ పరిస్థితుల్లోనూ మీలాంటి సంస్కృతిగల వారు భార్యను విడిచిపెట్టరు—ఆమె నైతిక ప్రవర్తనను అనుమానించి, బాధపడి, సమాజానికి భయపడ్డప్పుడు తప్ప! మీ భార్య 'తప్పు' చేసి ఉంటుంది. అందుకే బంగారం లాంటి గృహాన్ని విచ్ఛేదం చేసుకొని ఈ ప్రాంతాలకు వచ్చేశారు! ఎందుకు? మనశ్శాంతి చిక్కుతుందనేనా?... కాని ఇక్కడ మీరు మరొకతప్పు చెయ్యబోతున్నారు.... అసలు ఈ తప్పు అనేదానికి అర్థమేమిటి శేఖర్‌బాబు?'

తనమాటి ప్రశ్నకు అతను సమాధానం చెప్పలేడని సుచిత్రకు తెలుసు. అందుకే తర్వాత అంది:


'తప్పులు అనే మాటను స్థూలంగా చూసేసరికి పెద్ద అర్థాలు కనిపిస్తాయి కాని సూక్ష్మంగాయోచిస్తే అసలు తప్పుకు అర్థమే లేదు. మానవుడు ఈ తప్పు అనేదానికి ఇంతపెద్ద అర్థాన్నీ, ప్రాముఖ్యాన్నీ ఇవ్వడం మొదలుపెట్టింది— సామాజిక జీవనానికి అలవాటు పడుతున్నప్పుడే! నీతి, నియమం, అనేవి మానవసమాజానికి పునాదిగోడలు. ఈ పునాదుల్ని ప్రశ్నించడానికీ, పెకలించడానికి ఏవ్యక్తి ప్రయత్నించినా దానినే తప్పు అని ఆ వ్యక్తిని నలుగురూ నిందించడమో, బహిష్కరించడమో చేశారు...కాని ఏ సామాజిక జీవనంలో తప్పు అనేదానికి ఇంత అర్థముందో ఆసామాజిక జీవనమే అల్లకల్లోలమైనపుడు సదరు 'తప్పు'కు ఏమని నిర్వచనం చెప్పుకోగలం?'

సుచిత్ర ఆగిపోయింది.

శేఖరం గుండెల్లో గగ్గోలు పుట్టింది. నోరు విప్పలేక తికమకపడుతున్నపుడు తిరిగి ఆవిడే అంది!

'నేను జీవితంలో చాలా అనుభవించాను శేఖర్‌బాబు. మీరు తప్పు చేశారు.....మీరు కేవలం కర్తలే, తప్పు చేయడం అనే క్రియ దగ్గర. కాని నేను దానికి కర్మనై దానివల్ల వచ్చే ఫలితాలను అనుభవించాను. అందువల్ల కర్తగా మీకు తెలియని 'తప్పుబాధ', కర్మగా నాకు బాగా తెలుసు. మీరీపాటికి 'రబీన్' తీసుకొచ్చిన నా డైరీ చదివే ఉంటారనుకుంటాను. నేనా 'ఇతిహాసాన్ని' కావాలనే రబీన్ చేతికిచ్చాను... రబీన్ ఒక తప్పుకు సాక్ష్యం. కాని రబీన్ తండ్రి ఎవరని ప్రశ్నించినపుడు, నేను ఒక ప్రాణంలేని నిఘంటువులోని మాట 'తప్పు'ను చూపిస్తాను. ఈ తప్పును చేసింది, నీతి నియమాలనే పునాదిగోడల్ని పెకలించడానికి ప్రయత్నించిన కొందరు మూర్ఖులు. వాళ్ళు ముస్లిములే కానివ్వండి, హిందువులే కానివ్వండి, శ్వేత జాతులవాళ్ళే కానివ్వండి—ఎవరైనా తప్పు చేస్తారు. తప్పును మానవస్వభావంగా వర్ణించే సుభాషితాన్ని చూసుకొని తృప్తిపడడం నాకు చేతకాదు. అందుకే ఈ ఎనిమిదేళ్ళూ నిర్విరామంగా ఆలోచించాను. ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. కాని శేఖర్‌బాబూ! నేను హృదయపూర్వకంగా గౌరవించి, ప్రేమించిన మీరుకూడా తప్పు చేశారని తెలుసుకున్నాక నాకు నవ్వూ, ఏడుపూ వచ్చాయి. అయితే మీరు చేసిన తప్పు ఏమిటంటారు? మీ అర్ధాంగిని మీరు విడిచిపెట్టడంకాదు. ఆమె మీనుంచి శాశ్వతంగా దూరమయ్యే పరిస్థితుల్ని కలిగించడమే మీ తప్పు.. మీ శ్రీమతి మరణించింది.'

శేఖరం ఈ మాటలతో వణికిపోయాడు.



పత్రిక చూపించమని ప్రాధేయపడ్డాడు. సుచిత్ర దీనికి సమాధానం చెప్పకుండా—

'మీ మనస్సులో జరుగుతున్న సంఘర్షణకు నేనే కారణ మనుకుంటే, నేనూ, మీరూ కూడా మళ్ళీ తప్పుచేసిన వాళ్ళమవుతాము. నన్ను మరిచిపోవడానికి ప్రయత్నించండి. సాయంకాలం తిరిగి మీ దేశం వెళ్ళిపొండి'— అని సలహా ఇవ్వడంతో అతనిలో అనిశ్చల స్థితి పరాకాష్ఠ నందుకొంది.

ముఖంతిప్పుకొని ఆ వెళ్ళడం వెళ్లడం తిన్నగా స్టేషన్‌కు వెళ్ళిపోయాడు.


ఆంధ్రకు అతన్ని చేరవేసే వాహనాలేమీ అక్కడలేవు. సాయంకాలం అయితేనేగాని బయలుదేరవు. కాళ్ళీడ్చుకుంటూ బ్రిడ్జిమీద పదిసార్లు పచార్లు చేశాడు.


ఈ మహానగరంలో ఎవరికెవరు? ఎవరి బాధ ఎవరిక్కావాలి? అలాంటి నిర్లక్ష్య ప్రదేశంలో తన గురించి బాధపడి, తనకు అమూల్యమైన సలహా ఇచ్చిన వ్యక్తిని తనెలా మరిచిపోగలడు?

పదేపదే అతన్ని ఇదే ఆలోచన వేధించ మొదలుపెట్టింది. రబీన్‌కు తండ్రెవరు?' తన కొడుకుగా చలామణీ అవుతున్న బాబుకు తను తండ్రి కాదేమో! సుచిత్ర ఒక తప్పుకు బలైంది. జయ కూడా అదే తప్పుకు గురైంది. తను సుచిత్రను క్షమించగలిగినపుడు జయను క్షమించలేడా? జయ ఎలానూ ఈలోకాన్ని విడిచి వెళ్ళిపోయింది. ఇహ తను క్షమిస్తే ఏమిటి? క్షమించకపోతే ఏమిటి? జయ పోయింది... జయ చచ్చిపోయింది.

తన జయ, తనలో, తనహృదయంలో అత్యున్నత పీఠాన్ని సంపాదించుకున్న జయ, అంతరించిపోయింది. అమాయకంగా, ఆనందంగా చిలిపిగా నవ్వుతున్న రెండు కళ్ళు అతనికి కనిపించాయి... 'జయా! నిన్ను నేనే చంపేశాను, అని బావురు మన్నాడు! ముఖంకప్పుకొని ఏడ్చాడు. దారమ్మటపోయే నలుగురూ అతన్ని చూపి, తోసుకొంటూ ముందుకుపోయారు.

బ్రిడ్జిమీదినుంచి దూకి తనూ జయ దగ్గరకే పోవాలనుకొన్నాడు. అంతలో పత్రికల కుర్రాడికేక వినిపించింది. గబగబా పరుగెత్తి నాలుగు రకాల పత్రికలు కొన్నాడు.





ఒప్పులకుప్ప....వయ్యారి భామ

చిత్రం—కుమారి జి. శారద (విజయనగరం)

ఒక పత్రిక రెండోపేజీలో రెండుకాలముల నిండుగా తనూ, జయా, బాబూ క్రితం సంక్రాంతినాడు తీయించుకొన్న ఫోటో ఉంది. ఫోటోక్రింద బాబు వ్రాసినట్లు ఆంగ్లంలో ప్రకటన ఉంది.

'నాన్నా! అమ్మ నీకోసం బెంగపెట్టుకొని మంచినీళ్ళయినా ముట్టకోకుండా ముప్పై రోజులు ఉపవాసంచేసి చివరికి మొన్న బుధవారం చచ్చిపోయింది. ఇప్పటికైనా ఇంటికి రావా నాన్నా? నన్నెవరు పెంచుతారు? నా బ్రతుకేం కావాలి నాన్నా? నన్నూ అమ్మదగ్గరికే వెళ్ళిపో మంటావా?'

శేఖరం ఈ ప్రకటన చదివి 'వద్దు! వద్దు! నేను వస్తున్నా నాన్నా! నీకోసమే నేను బ్రతుకుతా బాబూ!' అని అరిచి స్టేషన్‌కు పరుగెత్తాడు.

కాని మద్రాసు మెయిల్ అప్పుడే ప్లాట్ ఫారాన్ని విడిచిపెట్టేసింది. దేవుడు కూడా తనను ఏడిపిస్తూ ఉన్నాడు. అతనలా దిగులుగా కూర్చుండిపోయాడు!

ప్రొద్దుటినుంచి పచ్చిమంచినీళ్ళైనా ముట్టుకోలేదు. అతనికి ఒళ్ళు తిరిగింది. మెల్లగా అడుగులు కదిపి బయటకొచ్చాడు. ఏం చేస్తున్నదీ గుర్తులేకుండా యాంత్రికంగా ట్రాము ఎక్కి, ధర్మతలా వీధిలోదిగి పెరేడ్ గ్రౌండ్సుకు అడ్డంగానడిచి విక్టోరియా మెమోరియల్ హాల్ ప్రాంగణంలో ఉన్న ఆ వేప చెట్టు దగ్గరకు వచ్చాడు.

చుట్టూ చూశాడు. తనకు కావలసిన రెండు ప్రాణులు తప్ప మిగతా ప్రపంచ మంతా కనిపిస్తూనంది. మెల్లగా 'రబీన్' అని పిలిచాడు.

సమాధానం లేదు.

రోజూ అదే సమయంలో అదే వేపచెట్టు సాక్షిగా పచ్చటిపచ్చికమీద కూచుని రబీన్‌తో సుచిత్రతో కబుర్లు చెబుతూ హాయిగా నవ్వుతూఉండే శేఖరం రెండు కళ్ళనుంచీ ధారలు కడుతున్న అశ్రుప్రవాహంతులను చుట్టు పక్కల ఎవరూ గుర్తించినట్లులేదు.

ఈ ప్రపంచమంతా తనను బహిష్కరిస్తూంది. ఈ ప్రజలందరూ తననే నిందిస్తున్నారు. చివరికి సుచిత్రా తననే తప్పు పట్టింది.

'నేను చచ్చిపోతాను...పోతాను..అదొక్కటే నాకాత్మశాంతి'... అని పిచ్చిగా అరిచి లేచి పరుగెత్తబోయాడు.

కాని అప్పుడే మెత్తని, చల్లని, మృదువైన హస్తమొకటి అతని భుజంమీద పడడంతో అతను తల త్రిప్పి ఎదుటి వ్యక్తిని చూసి కడుపులోని దుఃఖాన్ని ఆపుకోలేక బావురు మన్నాడు.

సుచిత్ర అతన్ని ఓదార్చింది; బుజ్జగించింది; మెల్లగా అంది;

'నేను వచ్చాను శేఖర్‌బాబూ! పదపండి, ఈరాత్రికే జనతాలో మీదేశం వెళ్ళిపోదాం.'

అతనీమాటల్ని అర్థం చేసుకోలేక తికమక పడ్డాడు. ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

ఆవిడా ఏడుస్తూంది. శేఖరం పరవశత్వంతో ఒక్కసారిగా ఆమె కైశికాలనూ, కళ్ళనూ, చెక్కిళ్ళనూ వణికే వేళ్ళతో స్పృశించి ఒక్కసారిగా ఆమెను గుండెలకు హత్తుకున్నాడు.

వెంటనే ఆ మధుర పరిష్వంగనను విడిచి, చుట్టూ చూసి—

'రబీన్ ఏడీ?' అన్నాడు.

సుచిత్ర గుటకవేసి సౌమ్యంగా జవాబు ఇచ్చింది.

'శాంతినికేతన్ పంపించేశానుశేఖర్‌బాబూ!' ★